
సాక్షి
గుంటూరు
మంగళవారం । 21 । జనవరి । 2025



## సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 140 క్యూసెక్కులు విడుదల చేశారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 559.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,019 క్యూసెక్కులు విడుదలవుతోంది.

## హుండీ ఆదాయం రూ.2,44,621



అల్లూరు(కర్లపాలెం): అల్లూరులోని రాజ్య లక్ష్మీ సమేత లక్ష్మీ నర సింహస్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కిం చారు. రూ.2,44,621 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఎంవీఎస్ వర్మ తెలిపారు.

## న్యూస్‌రీల్

### 23 నుంచి మిర్చి యార్డులో రైతులకు ఉచిత భోజనం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో గురువారం నుంచి రైతులకు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభి స్తున్నట్లు మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి కార్య దర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అమానత్ పట్టీలు ఆధారంగా రైతులకు ఉచిత భోజనం టోకెన్లు జారీ చేస్తామని తెలిపారు. ఉచిత భో జన కేంద్రం వద్ద సిబ్బందిని నియమించి, వారికి శిక్షణ కూడా ఇచినట్లు తెలిపారు.

### 23న జాతీయ ఓటర్ల దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ ఓటర్ల దినో త్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 23న జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖా ధికారి సీవీ రేణుక సోమవారం ఓప్రకటనలో తెలిపారు. "నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్" అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, స్లోగన్ రైటింగ్ పోటీలు గురు వారం ఉదయం 9.30 గంటలకు గుంటూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతాయని తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఈనెల 25న జరగనున్న జాతీయ ఓటర్ల దినో త్సవ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బహుమతులు అందజేస్తారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

### ఏఎన్‌యూ డిస్టెన్స్ డిగ్రీ కోర్సుల ఫలితాలు విడుదల



ఏఎన్‌యూ(గుంటూరు ఈస్ట్): ఆచార్య నాగా ర్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ గతేడాది అక్టోబర్/నవం బర్ నెలల్లో నిర్వహించిన పలు డిగ్రీ కోర్సుల ఫలితాలను విడుదల చేసినట్లు దూరవిద్య పరీ క్షల డిప్యూటీ రిజిస్ట్రార్ సయ్యద్ జైన్ లాబ్దిన్ సోమవారం తెలిపారు. ఫలితాల సీడీని యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు విడుదల చేశారు. వీసీ కె.గంగాధరరావు మాట్లాడుతూ బీఏ నాలుగో, ఐదో సెమిస్టర్, బీకాం (జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్), 4, 5 సెమిస్టర్లు, బీబీఏ కోర్సుల 4,5 సెమిస్టర్ల రెగ్యు లర్, సప్లమెంటరీ పరీక్షల ఫలితాలను విడు దల చేసినట్లు వెల్లడించారు. జైన్ లాబ్దిన్ మాట్లాడుతూ ఫలితాలు విడుదలైన కోర్సులకు సంబంధించి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఫిబ్రవరి 3లోగా ఒక్కొక్క పేపర్‌కు రూ.770 చెల్లించి, దరఖాస్తులను దూరవిద్య కేంద్రం పరీక్షల కో-ఆర్డినేటర్ కార్యాలయానికి అందేలా పంపాలని సూచించారు.

### మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మధ్యవర్తిత్వం తో కేసులు పరిష్కారమవుతాయని సుప్రీం కోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ అడ్వకేట్స్ సుదర్శనా సుందర్, జి.శ శిదేవి (చెన్నై) అన్నారు. సుప్రీంకోర్టు మీడియేష న్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ(న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ ఆవరణలో ఎంపికైన న్యాయ వాదులకు మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. న్యాయవాదులు అందరూ మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారంలో భాగస్వాములు కావాలని వక్తలు కోరారు. ఒకటో అదనపు జిల్లా జడ్జి వి.ఎ.ఎల్. సత్యవతి, సంస్థ కార్య దర్శి టి.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

### యార్డుకు 90,567 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 90,567 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 77,096 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,200 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.16,000 వరకు ధర లభించింది.

# అబ్బే.. వెబ్‌బై

## బాబు సర్కారు 'కొత్త' నాటకం



- కొత్త పింఛన్ల మంజూరుకు ఎగనామం
- నేటికీ తెరుచుకోని వెబ్‌సైట్

కొరిటెపాడు(గుంటూరు): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడు నెలలు పూర్తయింది. అయితే ఇంత వరకు కొత్త పింఛన్ల పంపిణీపై కార్యాచరణ రూపొందించలేదు. గతేడాది అక్టో బర్ ఒకటో తేదీ నుంచే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని అప్పట్లో ప్రభుత్వ పెద్దలు ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ఇంతవరకు ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదు సరికదా కనీసం పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ కూడా తెరవ లేదు. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులు పిం ఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలు, కుల, మతాలకు సంబంధం లేకుండా 60 ఏళ్లు నిండిన వెంటనే వలంటీర్లు దరఖాస్తు పూర్తి చేసి సచివాలయంలో ఇస్తే పింఛన్లు మం జూరయ్యేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవ డంతో గత ప్రభుత్వంలో పింఛను కోసం దర ఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురు చూపులు తప్పడం లేదు. గుంటూరు నగరంలో సుమారు 2,500 మంది అర్హులైన పింఛన్‌దారులు ఉన్నారు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ తెరుచుకోకపోవడంతో వారంతా ఆశగా ఎప్పుడు వెబ్‌సైట్ తెరుస్తారా అని నిరీక్షిస్తున్నారు.

**అర్హత ఉన్నా ఎదురు చూపులే..**

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో లబ్ధి దారులు వస్తున్నారు. ప్రభుత్వం నూతన పింఛన్ల దరఖాస్తు కోసం వెబ్‌సైట్ తెరవక పోవడంతో అర్హులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో? ఇంకా ప్రభుత్వం నుంచి సమాచారం లేదని సచివా లయ సిబ్బంది చెబుతున్నారని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గత ప్రభుత్వంలో పక్కాగా..**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛను దరఖాస్తు చేసుకున్న వెంటనే అందించేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్ల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. దీం తో కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకో వాలని భావించిన వారు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

**రెండు వందల రోజులు దాటినా తెరుచుకోని వెబ్‌సైట్..**

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఆగిన పింఛన్ వెబ్‌సైట్.. కూటమి ప్రభుత్వం



ఏర్పడి 200 రోజులు దాటినా ఎందుకు తెరుచుకో లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారు.

**పింఛన్లు తొలగించే కుట్ర..**

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు.. ప్రస్తుతం ఉన్న పింఛన్లను ఎలాగైనా తొలగించాలని అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. పింఛన్ లబ్ధిదారులను సర్వే చేసి అనర్హత పేరుతో తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం ప్రజలు ఎదురు చూస్తుంటే ఉన్న పింఛన్లు తొలగించడానికి అధికార పార్టీ నాయ కులు కుట్రలు చేయడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి.

### ఐదు నెలలుగా పింఛన్ కోసం తిరుగుతున్నా..

నా వయస్సు 58 ఏళ్లు. నా భర్త ఇమ్మానియేలు మరణించి 8 నెలలు కావస్తోంది. ఒక కూతురు ఉంది. పెళ్లి కావడంతో అత్తారింటికి వెళ్లి పోయింది. గతంలో నా భర్త ఇమ్మానియేలుకు వృద్ధాప్య పింఛన్ వచ్చేది. ఆ పింఛన్‌తో ఇద్దరం జీవనం సాగించేవాళ్ళం. ఇటీవల సర్వే నిర్వహించి నా భర్తకు వచ్చే పిం ఛన్ తొలగించారు. దీంతో నాకు ఏ ఆధారం లేకుండా పోయింది. వితంతు పింఛన్ కోసం ఐదు నెల లుగా కాళ్లు అరిగేలా సచివాలయం చుట్టూ తిరుగుతున్నాను. పింఛన్ కోసం దరఖాస్తు చేయాలని సచివాలయం అధికారులను వేడుకుంటున్నా. వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదని సమాధానం ఇస్తు న్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి నాకు పింఛన్ వచ్చేలా చూడాలని వేడుకుంటున్నా.

– ధీకాల మరియమ్మ, భారతీపేట

# వృద్ధుల ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

**ఎస్పీ సతీష్‌కుమార్**

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజా సమ స్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిం చారు. బాధితుల గోడు ఆలకించారు. ఎస్పీ మాట్లాడుతూ మానవతా దృక్పథంతో సమస్యలు పరిష్కరించాలని అన్నారు. వృద్ధుల ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని చెప్పారు. శిక్షణ ఐపీఎస్ శ్రీదీక్ష, ఏఎస్పీ(క్రైం) కె.సుప్రజ, డీఎస్పీలు రమేష్, శివాజీరాజు అర్జీలు స్వీకరించారు.



బాధితుల సమస్య ఆలకిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

### ఎక్కువ వడ్డీ ఆశ చూపి మోసం

విశాఖపట్నానికి చెందిన ఓ వ్యక్తి ఎక్కువ వడ్డీ ఆశ చూపడంతో విడతల వారీగా రూ.59 లక్షలు చెల్లించాం. కొంతకాలం వడ్డీలు క్రమంగా చెల్లించి ఆ తర్వాత ఆపేశాడు. గతేడాది ఆగస్టులో అడిగితే చెల్లించేస్తానని నమ్మబలికాడు. కానీ చెల్లించలేదు. మోసపోయాం. అతనిపై ఇటీవల నగరంపాలెం పీఎస్‌లో ఫిర్యాదు చేశాం. ఎటువంటి స్పందన లేదు. న్యాయం చేయండి.

– ఓ యువతి, రామిరెడ్డినగర్, ఏటీ అగ్రహారం

### భర్త మోసగించాడని..

నా భర్త మరొక యువతితో కలిసి ఉంటున్నాడు. నన్ను మోసం చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. న్యాయం చేయండి

– ఓ వివాహిత, ఐపీడీ కాలనీ, సంగడిగుంట

### రూ.10.40 లక్షలు తీసుకుని..

రెండేళ్ల క్రితం ఓ వ్యక్తి తన కుమార్తె అవసరాల నిమిత్తం రూ.10.40 లక్షలు తీసుకున్నాడు. రెం డేళ్లు గడిచినా డబ్బులు చెల్లించలేదు. అదేమని అడిగితే బెదిరిస్తున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. న్యాయం చేయండి.

– ఎస్.వెంకటరావమ్మ, గుంటూరు వారితోట

### వీఆర్వో మోసగించాడు

యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఓ వీఆర్వో గతేడాది జూన్‌లో పరిచయమయ్యాడు. వంకాయలపాడు గ్రామంలో పొలం ఉందని చెప్పి నమ్మబలికాడు. అగ్రిమెంట్ రాయిస్తానని చెబితే రూ.3 లక్షలు చెల్లించాను. పొలం ఆన్‌లైన్ చేయించి ఇస్తానని చెప్పి, మరో రూ.17 లక్షలు తీసుకున్నాడు. అప్పటి నుంచి ఆన్‌లైన్ చేయ లేదు. రిజిస్ట్రేషన్ చేయలేదు. పెదకాకానిలోని వీఆర్వో ఇంటికెళ్లగా ఆయన కుటుంబ సభ్యులు ఇష్టానుసారంగా మాట్లాడారు. తప్పుడు కేసులు బనాయిస్తామని బెదిరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

– షేక్.మౌలా బుడే, బొప్పూడి గ్రామం చిలకలూరిపేట

### నిందితులను అరెస్ట్ చేయాలి



శ్రీదేవి ఓ సీడ్స్ కంపెనీ సేల్స్ విభాగంలో పనిచేసేది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృ ష్ట్యా ఆమెకు బంధువులు హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.5 లక్షలు వడ్డీకి ఇప్పించారు. వడ్డీ చెల్లించినా అసలు చెల్లించ లేదని వడ్డీకి ఇచ్చిన వ్యక్తి శ్రీదేవి పట్ల అస భ్యంగా ప్రవర్తించాడు. బంధువులూ అతనికి వత్తాసు పలికారు. ఆమె మనస్తాపం చెంది గతేడాది నవంబర్‌లో పురుగు మందు తాగి మరణించింది. అంతకుముందు వీడియో కాల్‌లో పురుగు మందు డబ్బా పట్టుకుని, తన చావుకు ఎవరెవరు కారణమనేది తెలి పింది. అయినా పోలీసులు నిందితులను అరెస్టు చేయలేదు. న్యాయం చేయాలి.

– శ్రీదేవి భర్త ఆనంద్, తనయులు, పలు సంఘాల నేతలు

# హేతువాద కవిరాజు

- రచనలతో సమాజాన్ని మేల్కొల్పిన కొండవీటి వెంకటకవి
- వెంకటకవి క్రోసూరు మండలం విప్పర్ల వాస్తవ్యులు
- సుప్రసిద్ధ రచయిత, హేతువాది, ఉపన్యాసకుడిగా ప్రఖ్యాతి
- 25న జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం



కవిరాజు కొండవీటి వెంకటకవి (ఫైల్)

క్రోసూరు: దేశవ్యాప్తంగా మతతత్వం పెచ్చురి ల్లుతున్న నేటి తరుణంలో కలాన్ని ఖడ్గంగా చేసుకు ని, తన జీవితాన్నే ఆయుధంగా మలిచి సంఘ సం స్కరణకు పూనుకున్న సాహితీవేత్త, హేతువాది, అభ్యుదయవాది, మహాకవి కొండవీటి వెంకటకవి. ఆయన పల్నాడు జిల్లా క్రోసూరు మండలం విప్పర్ల వాస్తవ్యులు. కొండవీటి వెంకటకవి అసలు పేరు కొండవీటి వెంకటయ్య, తల్లిదండ్రులు నారాయణ, శేషమ్మలు. 1918 జనవరి 25న ఆయన జన్మిం చారు. ఈయన సతీమణి పేరు చిన్నమ్మ, వీరికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు.

**వెంకటకవి రచనలు..**

వెంకటకవి తన 14వ ఏట నుంచి రచనలు చేయటం ప్రారంభించారు. 1932లో కర్షక శతకాన్ని రాశారు. అనంతరం హితబోధ, చెన్నవ కేశవ శతకం, 1954లో నెహ్రూ చరిత్ర మొదటి భాగం రచించి బెజవాడగోపాలరెడ్డికి, ద్వితీయభాగం గుత్తికొండ నరహరికి అంకితం చేశారు. త్రిశతి పేరుతో బుద్ధుడు, వేమన, గాంధీజీల గురించి మూడు శత కాలు రచించారు. 1984లో పోతులూరి బ్రహ్మం మతానికి ఆస్థానకవిగా ఉంటూ శ్రీ వీర బ్రహ్మేంద్ర సుప్రభాతాన్ని సంస్కృతంలో రచించారు. 1977లో అగ్రనటుడు నందమూరి తారక రామారావు తీసిన దానవీరశూరకర్ణ సినిమాకు సంభాషణలు రాశారు. అలా చలన చిత్ర రంగానికి పరిచమయ్యారు. ఆ తరువాత శ్రీమద్విరాటపర్వం, శ్రీమద్విరాట్ పోతు లూరి వీరబ్రహేంద్రస్వామి చరిత్ర చిత్రాలకు సం భాషనలు రాశారు. వీరు రచించి గ్రంథాలన్నీ కవిరాజు గ్రంథ మాల పేరుతో స్వయంగా ప్రకటిం చినవే కావటం విశేషం. అప్పట్లో ఎంఎస్ స్ఫూర్తితో, కమ్యూనిస్టు భావజాలంతో బాబాలను విమర్శిస్తూ ఉపన్యాసాలిచ్చారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి భావజాలంతో హేతువాదిగా మారి అనేక రచనలు చేశారు. మంత్రాలు లేకుండా త్రిపురనేని రామస్వామి రాసిన పెళ్లి సూత్రాలు చదివి అనేక వివాహాలు చేయించారు.

**పురస్కారాలు..**

1953లో గుంటూరు జిల్లా పెదకూరపాడులో వీరికి కవిరాజుగా బిరుదు ప్రధానం చేసి సత్కరించారు. 1971లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ కళాప్రపూర్ణ పురస్కారం. 1979 వెంకటకవి కవితా బ్రహ్మోత్స వాన్ని డాక్టర్ కొడాలి రంగారావు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా సత్తెనపల్లిలో నిర్వహించారు. ఎడ్లబండి కట్టి అంగరంగ వైభవంగా సినీనటులు ఎన్‌టీ రామారావు, కొంగర జగ్గయ్య లతో పాటు వెంకటకవిని సత్తెనపల్లి పురవీధుల్లో ఊరేగించి అశేష జనవాహిని సమక్షంలో పౌరసత్కారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంకటక విని అధికార భాషా సంఘ సభ్యులుగా నియమిం చింది. వెంకటకవి 1991 ఏప్రిల్ 7న కాలం చేశారు. వెంకట కవి లాంటి గొప్ప రచయిత, హేతువాదిని తెలుగు ప్రజలు, నేటి విద్యార్థులు, యువత జ్ఞప్తికి చేసుకోవాల్సిన అవసరం ఉంది.

# జీఎంసీ కమిషనర్ అవినీతిపై పోరాటం ఆగదు

**మేయర్ కావటి, డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు**



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మేయర్ మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్ వజ్రబాబు, కార్పొరేటర్లు

గుంటూరు వెస్ట్ : జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివా సులు వ్యవహార శైలి, అవినీతి విస్మయానికి గురి చేస్తోందని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని మేయర్‌తోపాటు డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్ర బాబు( డైమండ్ బాబు), కార్పొరేటర్లు కలిశారు. కమిషనర్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మేయర్ మాట్లాడుతూ గత ఏడాది బుడమేరు వరదల సహా యార్థం కమిషనర్ కౌన్సిల్‌కు చెప్పకుండా రూ.9.24 కోట్లు అక్రమ చెల్లింపులు చేశారన్నారు. ప్రశ్నించినందుకు తమపై అకారణంగా కక్ష పెంచు కున్నారన్నారు. కమిషనర్ అవినీతిపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. ఫిబ్రవరి 3వ తేదీన జరగనున్న స్టాండింగ్ కమిటీ ఎన్నికలను కలెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించాలని కోరారు. కమిషనర్ అవినీతిపై తమ పోరాటం ఆగదని, కలె క్టర్ నుంచి ప్రధాన మంత్రి వరకు ఫిర్యాదులు చేస్తామన్నారు.

**టీడీపీ నాయకులను తప్పుదోవ పట్టిస్తున్నారు**

బుడమేరు వరద సహాయక చెల్లింపులు చేసింది కమిషనర్ పులి శ్రీనివాసులేనని, వాటి చెల్లింపుల వివరాలు, పరిస్థితులు ఆయనే చెప్పాలని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్ర బాబు(డైమండ్ బాబు) డిమాండ్ చేశారు. కేంద్ర గ్రామీణ, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖ ర్‌తోపాటు ముగ్గురు శాసన సభ్యులను, టీడీపీ నాయకులను, అధికారులను కమిషనర్ తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు తప్పుదోవ పట్టి స్తున్నారన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు ఈచం పాటి ఆచారి, మార్కెట్ బాబు, పడాల సుబ్బారెడ్డి, అచ్చాల వెంకటరెడ్డి, రోషన్, బూసి రాజలత, వేముల జ్యోతి, అడకా పద్మ, గురవయ్య, దూపాటి వంశీ, అంబేద్కర్, యాట్ల రవి, ఉడుముల శ్రీనివా సరెడ్డి, యెక్కలూరి కోటి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదు**

గుంటూరు వెస్ట్: ప్రజల సమస్యలను పరిష్కరించ డంలో కొందరు అధికారులు అలసత్వం వహిస్తు న్నారని, ఇలా అయితే ఇబ్బందులు తప్పవని కలె క్టర్ ఎస్.నాగలక్ష్మి హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరి ష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ వేదిక ప్రాముఖ్యతను అధికారులు గుర్తించా లన్నారు. చిన్న సమస్యల పరిష్కారానికీ కొందరు అధికారులు అర్జీదారుడిని పదే పదే తిప్పుకుంటు న్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ముఖ్యంగా సిబ్బంది అర్జీదారులతో మర్యాదగా వ్యవహరిం చాలన్నారు. తమ అర్జీలను ప్రజలు స్థానికంగా ఉం డే మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికా రులకు ప్రతి వారం ఇవ్వొచ్చన్నారు. అనంతరం వచ్చిన 172 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీని వాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరా జు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

### నా బిడ్డకు పూర్తి పింఛన్ మంజూరు చేయండి

నా బిడ్డకు ఇప్పటికీ 20 ఏళ్ళు వచ్చాయి. నూరు శాతం అంగవైకల్యం ఉంది. ప్రస్తుతం రూ.6 వేలు పింఛన్ వస్తుంది. నూరు శాతం వైకల్యముంటే రూ.15 వేలు ఇవ్వాలి. నా బిడ్డ మందులకు, అనారోగ్య సమస్యలకు కొంత సాయంగా ఉంటాయి. దయచేసి మంజూరు చేయండి.

– షేక్ శిలార్, పర్వీన్ దంపతులు, ఓబులనాయుడు పాలెం.

### అప్పు ఇచ్చి మోసం చేశారు

నా బిడ్డకు తీవ్ర అనారోగ్యం. అతని వైద్యం కోసం బంధువుల వద్దే రూ.3 లక్షలు అప్పుచేశా. దీంతో వారు నా 1.33 ఎకరాల భూమిని కాజేశారు. మాకు ఉపాధి కూడా లేదు. ప్రశ్నిస్తే రౌడీయిజం చేస్తున్నారు. న్యాయం చేయండి.

– వసుంధర, గుంటూరు

# జీజీహెచ్‌లో సర్వీస్ బ్లాక్ నిర్మాణానికి అనుమతి



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో నిర్మాణం ఆగిపోయి ఉన్న సర్వీస్ బ్లాక్‌ను పూర్తి చేసేందుకు గుంటూరుకు చెందిన తులసి సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ నిర్వాహకులు, గుం టూరు జీజీహెచ్ అభివృద్ధి సంఘం సభ్యుడు తులసి రామచంద్ర ప్రభు ముందుకు వచ్చారు. గతంలో ప్రైవేటు కంపెనీ నిర్వాహకులు నిర్మాణం పూర్తి చేయకుండా నిలిపివేశారు. సుమారు రూ. 7.50 కోట్లతో భవన నిర్మాణం పూర్తి చేసేందుకు తులసి రామచంద్ర ప్రభు ముందుకు రావడంతో భవన నిర్మాణం చేపట్టేందుకు ఆయనకు అనుమతి ఇస్తూ సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. సర్వీస్ బ్లాక్ నిర్మాణం పూర్తయితే సెంట్రల్ కిచెన్, హాస్పటల్ స్టోర్స్, లాండ్రి, ఎంఆర్‌డీ విభాగం, సీఎస్ఎస్‌డీ విభా గాలు అందుబాటులోకి రానున్నాయి. నాలుగు అంతస్తులతో భవన నిర్మాణం జరుగనుంది. ఉత్తర్వుల కార్యారూపణకు కృషి చేసిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్‌లకు ఆసు పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ కృతజ్ఞతలు తెలిపారు.

# కలెక్టరేట్ వద్ద న్యాయవాదుల నిరసన

- న్యాయవాదిపై పొన్నూరు పోలీసుల దాడికి ఖండన
- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం




కలెక్టర్ వద్ద ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

గుంటూరు వెస్ట్: పొన్నూరు పోలీసులు దళిత న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం కలెక్ట రేట్‌లో నిరసన వ్యక్తం చేశారు. సుమారు వంద మందికిపైగా న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది శాంత కుమార్, కేకేలు మాట్లాడుతూ గత నెల 25న పొన్నూరులో న్యాయవాది బి.ప్రకా శరావు తన స్నేహితులకు చికిత్స ఎందుకు చేయ డంలేదని వైద్యులను ప్రశ్నించినందుకు సీఐ రవి కిరణ్, ఎస్ఐ రాజ కుమార్, కానిస్టేబుళ్లు పోలీస్ స్టేషన్లో దారుణంగా కొట్టారన్నారు. ప్రకాశరావుకు తీవ్ర గాయాలయ్యాయని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజల క్షేమం కోసం పనిచేయాల్సిన పోలీసులు రక్తం కారేట్లు ఓ న్యాయవాదిని కొట్టడం అన్యాయమన్నారు. ఇలా అయితే ప్రజలకు పోలీసు లపై గౌరవం ఏముంటుందని ప్రశ్నించారు. దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కలెక్టర్ ఎస్.నాగ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వేములు ప్రసాద్, దేవర కొండ రోశయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

## వాణిజ్యం

### నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,200** గరిష్ఠం : రూ. **3,800**

మోడల్ ధర రూ. **3,500**

## క్లుప్తంగా

### జెస్సీరాజ్‌కు కలెక్టర్ అభినందన



**గుంటూరు వెస్ట్:** ప్రపంచ స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటి, ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం అందుకున్న జెస్సీరాజ్‌ను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అభినందించారు. జెస్సీరాజ్ అద్భుత ప్రతిభతో జిల్లాకు, రాష్ట్రానికి పేరు తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో డీఎస్డీఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

### గృహ నిర్మాణం నిరంతరం కొనసాగాలి

**కలెక్టర్ నాగలక్ష్మి**

**గుంటూరు వెస్ట్:** జిల్లాలో హౌసింగ్ లే–అవుట్లలో ప్రతివారం నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ ప్రగతిపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకు లింకేజీకి చర్యలు చేపట్టాలన్నారు. క్యాటిల్ షెడ్స్ మంజూరైన వాటిలో 50 శాతం కూడా పూర్తి కాలేదని, ఈవారంలో పూర్తి చేసేలా అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. ఆధార్ స్పెషల్ క్యాంపులో పిల్లల వివరాలు నమోదయ్యేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సెక్షన్ ద్వారా మంజూరు చేసిన తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణాలు గతనెల 31లోపు పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటికీ పూర్తి చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. పోషణ్ వాటికల ఏర్పాటును పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మంజూరు చేసిన పనులు వెంటనే ప్రారంభించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, పంట కుంటలు నిర్మించాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస యోజన గ్రామీణ 2.0 ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులను గుర్తించేందుకు మార్గదర్శకాల ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఆర్టిఫిషియల్ లింబ్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 4 నుంచి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, సీపీఓ శేషశ్రీ, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత
- భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభోత్సవం



ప్రీమియర్ లీగ్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న సీఐడీ ఎస్పీ సరిత, భాష్యం రామకృష్ణ, హనుమంతరావు

**గుంటూరు ఎడ్యుకేషన్:** విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంచుకుని జీవితంలో ఎదురయ్యే గెలుపోటములను సమానంగా స్వీకరించి, ముందుకు వెళ్లినప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకోగలరని సీఐడీ ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఎస్పీ కేజీవీ సరిత పేర్కొన్నారు. సోమవారం భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్ సమీపంలోని జేఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో బీపీఎల్ 2024–25లో భాగంగా భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ ప్రిలిమినరీ మ్యాచ్‌లను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ సరిత మాట్లాడుతూ అపజయాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. నేటి యువత క్రికెట్‌ను కేవలం క్రీడగానే పరిగణించాలని, జట్టును స్ఫూర్తివంతమైన నాయకత్వ లక్షణాలతో నడిపేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. క్రమశిక్షణ పట్టుదల, పోరాట పటిమ వంటి లక్షణాలను పెంచుకోవడంతోపాటు శారీరక, మానసిక పటిష్టానికి సహకరిస్తుందన్నారు.

**క్రీడా స్ఫూర్తిని పెంచేందుకే లీగ్**

భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు భాష్యం ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించామని తెలిపారు. గతేడాది ఆగస్టు 15న అధికారికంగా 150 క్యాంపస్‌లలో ప్రారంభించిన పోటీలు మూడు వేర్వేరు కేటగిరీల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. మొత్తం 720 మ్యాచ్‌లలో బ్రాంచ్ స్థాయిలో 420, జోనల్ స్థాయిలో 281, సెంట్రల్‌స్థాయిలో 19 మ్యాచ్‌లు జరుగుతాయని వివరించారు. సెంట్రల్ టోర్నమెంట్‌లో భాగంగా ప్రిలిమినరీలు ఈనెల 20న ప్రారంభం కాగా, ఈనెల 23న క్వార్టర్ ఫైనల్స్, ఈనెల 25న సెమీ ఫైనల్స్, 26న ఫైనల్స్ నిర్వహిస్తామని చెప్పారు. ముందుగా ఎస్పీ సరిత చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి, జెండాలతోపాటు బెలూన్లు ఎగురవేశారు. అనంతరం ప్రీమియర్ లీగ్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఉదయం గుంటూరు జెయింట్స్–3, వైజాగ్ వికింగ్స్–1 మధ్య జరిగిన మ్యాచ్‌లో గుంటూరు జెయింట్స్ జట్టు, మధ్యాహ్నం గుంటూరు గార్డియన్స్–2, తూర్పు గోదావరి ఎలైట్స్–3 మధ్య జరిగిన మ్యాచ్‌లో గుంటూరు గార్డియన్స్–2 జట్టు విజయం సాధించాయి. విజేతలకు భాష్యం రామకృష్ణ ట్రోఫీలు బహూకరించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్, ప్రిన్సిపాల్స్, టీచర్లు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ లారా కళాశాలకు సిస్కో నెట్ ఎకాడ్ ఎక్స్‌లెన్స్ అవార్డ్


ప్రిన్సిపల్‌ను, డీన్లను అభినందిస్తున్న లావు రత్తయ్య

**చేబ్రోలు:** చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు ప్రతిష్టాత్మక సిస్కో నెట్ ఎకాడ్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ లభించినదని కళాశాల ప్రిన్సిపల్ కె.ఫణీంద్ర కుమార్ సోమవారం తెలిపారు. దేశావ్యాప్తంగా సిస్కోనెట్ ఎకాడ్ సంస్థతో 150 కళాశాలలు అనుసంధానమై ఉన్నాయని, అందులో కేవలం 13 కళాశాలలకు మాత్రమే ఈ పురస్కారం లభించిందని పేర్కొన్నారు. వీటిలో విజ్ఞాన్ లారాకు పురస్కారం లభించిందని పేర్కొన్నారు. సిస్కోనెట్ ఎకాడ్ వారిచే నిర్వహించిన నెట్ వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రామింగ్, ప్యాకెట్ ట్రేసర్ అనే అడ్వాన్స్ కోర్సులలో విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తీర్ణత పొంది 8,600 సర్టిఫికెట్స్ సాధించినందుకు ఈ పురస్కారం లభించినదని తెలిపారు. విజ్ఞాన్ లారా కళాశాలకు ప్రతిష్టాత్మక సిస్కో నెట్ ఎకాడ్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ లభించినందుకు విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య డీన్లు, అధ్యాపకులను, సర్టిఫికెట్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు.

## గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీగా భానోదయ బాధ్యతల స్వీకరణ



**గుంటూరు రూరల్:** గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీగా జి.భానోదయ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని సౌత్ డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. అసాంఘిక శక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భానోదయ 2022 బ్యాచ్‌లో నియమితులయ్యారు. రాజమండ్రి ఈస్ట్ జోన్‌లో ప్రొబేషనరీ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. అక్కడి నుంచి గుంటూరు సౌత్ జోన్‌కు బదిలీపై వచ్చారు.

# చిన్నారుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

**రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు**


రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులతో పాఠశాల బృందం

**తాడేపల్లిరూరల్:** బాలల హక్కులను పరిరక్షణే ధ్యేయంగా వ్యవస్థలన్నీ చిత్తశుద్ధితో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు రాజేంద్రనాథ్, పద్మావతి సూచించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని వీవర్స్ కాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌ను సోమవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మాట్లాడుతూ జీవితంలో ప్రతిఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా కృషిచేయాలన్నారు. సోషల్ మీడియాను పరిమితంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఆహారం వండే విధానం, శుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ప్రభుత్వం పిల్లల హక్కుల పరిరక్షణకు ఉన్న చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్. బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యస్. శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై కమిషనర్ సానుకూల స్పందన

**బాపట్ల:** పంచాయతీరాజ్‌శాఖలోని ఉద్యోగుల సమస్యలపై ఆశాఖ కమిషనర్ ఎం.కృష్ణతేజ సానుకూలంగా స్పందించారని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు పల్నాటి శ్రీరాములు పేర్కొన్నారు. కమిషనర్ ఎం.కృష్ణతేజను తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యల వినతిపత్రం అందించారు. కమిషనర్ ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు పులిపాటి అమ్మయ్య కూడా ఉన్నారు.

## ముగ్గురిపై కత్తితో దాడి

**చిట్టీల వివాదమే కారణం!**

**లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్):** చిట్టీ వివాదం నేపథ్యంలో ముగ్గురిపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం జరిగింది. నగరంపాలెం పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన చల్లగొల్ల రమేష్ అదే ప్రాంతానికి చెందిన సింగయ్య ద్వారా రూ.లక్ష చిట్టీ వేశాడు. మూడు నెలలుగా రమేష్ డబ్బులు చెల్లించకపోవడంతో నిర్వాహకులు సింగయ్యకు ఫోన్ చేసి రమేష్ డబ్బులు చెల్లించలేదని, మధ్యవర్తిగా ఉన్న నువ్వు చెల్లించాలని చెప్పారు. దీంతో ఆగ్రహంతో సింగయ్య రమేష్‌కు ఫోన్ చేసి అసభ్యపదజాలంతో తిట్టాడు. రమేష్ సోమవారం తన కుమారుడు యశ్వంత్, బావమరిది నాయుడును తీసుకుని సింగయ్య ఇంటికి వెళ్లి చిట్టీ డబ్బులు చెల్లించాడు. డబ్బు కట్టడంలో కొంత ఆలస్యమైనంతమాత్రాన ఇష్టం వచ్చినట్టు బూతులు తిట్టడం సరికాదని చెప్పారు. ఈ నేపథ్యంలో సింగయ్యకు, రమేష్‌కు మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో సింగయ్య కుమారుడు మల్లికార్జునరావు ఇంట్లో ఉన్న కత్తితో రమేష్ కుమారుడు యశ్వంత్, నాయుడులపై కత్తితో దాడి చేశాడు. అడ్డు వచ్చిన రమేష్ తలపై దాడి చేశాడు. సమాచారం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సింగయ్య, మల్లికార్జునరావులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గాయాలపాలైన రమేష్, యశ్వంత్, నాయుడులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. పోలీసులు ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

**వేలిముద్ర స్కానర్ ఆధారంగా పట్టుకున్న పోలీసులు**


కేసు వివరాలు వెల్లడిస్తున్న నగరంపాలెం సీఐ నజీర్

**లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్):** ఇళ్ల ముందు పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్రవాహనాలను చోరీ చేసే అంతర్ రాష్ట్ర దొంగను వేలిముద్ర స్కానర్ ఆధారంగా నగరంపాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎం.నజీర్ కేసు వివరాలను వెల్లడించారు. హనుమయ్యనగర్‌కు చెందిన మాదాల సురేష్ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తుంటాడు. ఈనెల 15న రాత్రి తన ఇంటి ముందు ద్విచక్రవాహనం పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్టేషన్ పరిధిలో ఇదే తరహాలో మరో రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురికావడంతో అదనపు ఎస్పీ సుప్రజ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసుల సహకారంతో నగరంపాలెం సీఐ నజీర్ ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. నగరంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. పాత నేరస్తులను విచారించారు. థంబ్ ప్రింట్ (వేలిముద్ర) స్కానర్ ద్వారా విచారణ చేపట్టారు. దీని ఆధారంగా వాహనాలు చోరీ చేసింది దేవాపురానికి చెందిన పులి రమేష్‌గా గుర్తించి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. రమేష్ నుంచి ఐదు ద్విచక్రవాహనాలను రికవరీ చేశారు. రమేష్‌పై జిల్లాలోనే అనేక పోలీస్ స్టేషన్లలో 52 కేసులు ఉన్నట్లు గుర్తించారు. సోమవారం రమేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రమేష్‌ను పట్టుకునేందుకు ప్రతిభ కనబరిచిన నగరంపాలెం సీఐ ఎం.నజీర్‌ను ఎస్సై సలాంను సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

# తమ్ముడిపై కత్తితో అన్న దాడి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- బయటకు పొక్కుకుండా ఆస్పత్రిలో చేర్పించిన అన్న, వదిన
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడి భార్య
- పట్టించుకోని ఖాకీలు
- కుటుంబ గొడవల్లో తలదూర్చిన విజయవాడ టీడీపీ కార్పొరేటర్!


చికిత్స పొందుతున్న ఆరిఫ్ (ఫైల్)

**తాడేపల్లిరూరల్:** కుటుంబ కలహాల నేపథ్యంలో తన భర్తపై కత్తితో దాడి చేసి కదల్లేని స్థితికి తీసుకొచ్చిన బావ, కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఓ మహిళ విలేకరుల ఎదుట సోమవారం ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె కథనం ప్రకారం షేక్ ఆరిఫ్, ఆసిఫ్ అన్నాదమ్ములు. వీరి తల్లి షేక్ జమీల. ఆరిఫ్‌కు అన్న ఆసిఫ్, వదిన ఆయిషా, తల్లి షేక్ జమీలకు మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. ఆరిఫ్ భార్య సల్మా కాన్పు కోసం విజయవాడలోని ప్రభుత్వ ఆస్పతిలో గతనెలలో చేరింది. ఆ సమయంలో ఆరిఫ్‌కు అతని వదిన ఆయిషా, అన్నయ్య ఆసిఫ్‌కు మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 12న ఆసిఫ్ ఆరిఫ్‌ను కత్తితో విచక్షణ రహితంగా పొడిచాడు. అనంతరం ఆస్పత్రిలో చేర్పించి ఎవరికీ తెలియకుండా చికిత్స చేయించారు. అనంతరం తీసుకొచ్చి ఇంట్లోనే ఉంచి బంధించారు. ఆరిఫ్ భార్య సల్మా ఆస్పత్రి నుంచి జనవరి 10న ఇంటికి వచ్చి కదల్లేని స్థితిలో ఉన్న భర్తను చూసి ఏమైందని ప్రశ్నించింది. దీంతో అత్త, బావ, తోడికోడలు బెదిరింపులకు దిగారు. ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయాలని, లేకుంటే నిన్ను, నీ పిల్లలనూ చంపుతామంటూ బెదిరించారు. దీంతో సల్మా కదల్లేని స్థితిలో ఉన్న భర్త, 15రోజుల పసిగుడ్డుతో కలిసి పోలీసులను ఆశ్రయించింది. అయినా పోలీసులు కనికరం చూపలేదు. వారం రోజులుగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా కేసు నమోదు చేయలేదు. ఆదివారం విజయవాడకు చెందిన టీడీపీ కార్పొరేటర్ హర్షద్ వచ్చి సల్మా, ఆరిఫ్‌లను బెదిరించారు. ఇప్పటికే తీవ్రంగా గాయపడిన ఆరిఫ్‌కు మరో ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించారు. దీంతో సల్మా విలేకరులను కలిసి తన గోడు వెళ్లబోసుకుంది. న్యాయం జరిగేలా చూడాలని కన్నీరుమున్నీరైంది.

# సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆత్మహత్యాయత్నం

**అక్రమ కేసులు పెడుతున్నారంటూ వ్యక్తి ఆవేదన**


పురుగుమందు తాగుతున్న కల్యాణ్

**ప్రత్తిపాడు:** చర్చి స్థలం ఆక్రమించి నిర్మిస్తున్న గోకులం షెడ్డు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నందుకు కొందరు గ్రామస్తులు తనపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారంటూ ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పురుగు మందు తాగాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో చెబుతూ, పురుగు మందును తాగుతూ తీసుకున్న సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. ఈ ఘటన ప్రత్తిపాడు మండలంలో జరిగింది.. సెల్ఫీ వీడియోలో బాధితుడు చెప్పిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలం కొండేపాడుకు చెందిన ఓ వ్యక్తి గ్రామంలో గోకులం షెడ్డును నిర్మించుకుంటున్నాడు. ఆ స్థలంలో కొంత తన తాతలు దానంగా ఇచ్చిన చర్చి స్థలం ఉందని, గోకులం నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని గ్రామానికి చెందిన దాసరి కల్యాణ్ కొద్ది రోజులుగా గ్రామ, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నాడు. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు సమస్యను పరిష్కరించడం లేదు. ఈ క్రమంలో ఆదివారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి దాసరి కల్యాణ్‌ను దుర్భాషలాడాడు. కల్యాణ్‌తోపాటు అతని బంధువులపై అక్రమ కేసులు పెట్టారు. పోలీసులు ఆ కేసులు పట్టుకుని తనను వేధిస్తున్నారని, చర్చి స్థలం కోసం పోరాడుతున్న తనకు జరిగిన అవమానం భరించలేక పురుగుమందు తాగి చనిపోతున్నట్టు వీడియోలో వివరించాడు. అనంతరం పురుగుమందు తాగేశాడు. ప్రస్తుతం బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సమాచారం.

## యువ కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పల్లపోలు


**చినగంజాం:** యువ కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన పల్లపోలు ఆంజనేయ తేజా నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు అతనికి సోమవారం రాష్ట్ర యువ కాపునాడు అధ్యక్షుడు పూల చైతన్యమోహన్ నుంచి ఉత్తర్వులు అందాయి. తేజా నాయుడు కళాశాల చదివే రోజులలో విద్యార్థుల యూనియన్‌లో ఉత్సాహంగా పాల్గొని పలు సమస్యలపై పోరాడాడు. కళల పట్ల, కళాకారుల పట్ల అతనికి ఆసక్తి ఎక్కువ. తేజా నాయుడును గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేశారు.



## కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు


అభ్యర్థి ఛాతి కొలత తీస్తున్న పోలీసులు

**నగరంపాలెం(గుంటూరు వెస్ట్):** స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఎస్పీ సతీష్‌కుమార్ సోమవారం మైదానానికి చేరుకుని ఏఎస్పీలతో మాట్లాడారు. 680 మంది పరీక్షలకు రాగా 102 మంది ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుదిరిగారు. మిగతా 578 మంది అభ్యర్థులకు శరీర కొలతలు నిర్వహించగా 58 అనర్హత పొందారు. 520 మందికి 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించగా 377 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. 377 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించగా 189 మంది అర్హత సాధించారు. 377 మందికి లాంగ్ జంప్ పోటీలు జరగ్గా 362 మంది అర్హత సాధించారు. జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), జిల్లా ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలురెడ్డి పాల్గొన్నారు.


పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

## ఫార్మా.డీ, బీ ఫార్మసీ కోర్సులకు ఉజ్వల భవిష్యత్

**బాపట్ల:** ఫార్మా.డీ, బీ ఫార్మసీ కోర్సులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్థోపెటిక్ సర్జన్ డాక్టర్ వై.లక్ష్మణస్వామి పేర్కొన్నారు. బాపట్ల ఫార్మసీ కళాశాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ వై.లక్ష్మణస్వామి పాల్గొని మాట్లాడారు. ఫార్మా.డీ కోర్సు క్లినికల్ ఫార్మాసిస్టుగా, కమ్యూనిటీ ఫార్మాసిస్టుగా వైద్యసేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడతారని తెలిపారు. చక్కగా చదువుకుని ఉన్నతశ్రేణి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఈ.గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ జి.నాగార్జున, డాక్టర్ ఎం రంగనాథరెడ్డి, డాక్టర్ టి.గోవర్ధన్ రెడ్డి, ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరీ ఎం.నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ డి.వెంకయ్య చౌదరి, ట్రెజరర్ కోట వీరబ్రహ్మం, వైస్ ప్రెసిడెంట్‌లు వెంకట్రావు, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.